క్లుప్తంగా

నేడు పెద్దమ్మతల్లికి జలాభిషేకం

పాల్వంచరూరల్: తొలి ఏకాదశి పర్వదినం సందర్భంగా ఆదివారం పెద్దమ్మతల్లి ఆలయంలోని అమ్మవారికి జలాభిషేకం, పంచామృతాభిషేక పూజలు నిర్వహించనున్నట్లు ఈఓ రజనీకుమారి శనివారం తెలిపారు. స్థానిక గ్రామప్రజలు, భక్తులు హాజరు కావాలని ఈఓ కోరారు.

బీజేపీ అధ్యక్షుడిని కలిసిన నాయకులు



రాంచందర్‌రావుకు అభినందనలు తెలుపుతున్న ప్రభాకర్‌రెడ్డి

చుంచుపల్లి: ఇటీవల నూతనంగా ఎన్నికైన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు ప్రమాణ స్వీకారోత్సవం శనివారం హైదరాబాద్‌లో జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి హాజరై రాష్ట్ర అధ్యక్షుడికి భద్రాచలం ప్రసాదాన్ని అందించి శుభాకాంక్షలు తెలిపారు. అదే విధంగా కేంద్ర బొగ్గుగనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డిని కలిసి సింగరేణిలోని పలు సమస్యల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో కొండపల్లి శ్రీధర్ రెడ్డి, పూదరి సతీష్ పాల్గొన్నారు.

ఐఐఐటీలో సీటు సంపాదించిన విద్యార్థులు



శ్రీహరిణి పవార్

టేకులపల్లి: టేకులపల్లి కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని, ప్రభుత్వ ఉపాధ్యాయుల కుమార్తె వాంకుడోత్ శ్రీహరిణి పవార్ బాసర ఐఐఐటీలో సీటు సాధించింది. హెచ్‌ఎం ఎం.మోహన్‌రావు శనివారం మాట్లాడుతూ.. పదో తరగతిలో 546 మార్కులతో హరిణి మండల ర్యాంకు సాధించిందన్నారు. తండ్రి వాంకుడోత్ హత్తీరామ్‌నాయక్ టేకులపల్లి మండలం లక్ష్మీపురం ప్రభుత్వ పాఠశాలలో, తల్లి పార్వతి టేకులపల్లి కేజీబీవీలో టీచర్లుగా పని చేస్తున్నట్లు చెప్పారు.



అభిరామ్

సుజాతనగర్: మండలంలోని గరీబ్‌పేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పూర్తి చేసిన బండి అభిరామ్ బాసర ఐఐఐటీకి ఎంపికయ్యాడు. నిమ్మలగూడెం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ బండి రమేష్, కవిత దంపతుల కుమారుడు పదో తరగతిలో 558 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచాడు. ఈ నేపథ్యంలో ఐఐఐటీకి ఎంపిక కావడం పట్ల అభిరామ్‌ను అతని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అభినందించారు.

మెరిట్ స్కాలర్‌షిప్..



రిషిత

జూలూరుపాడు: జాతీయ స్థాయిలో నిర్వహించిన నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్‌కు పాపకొల్లు హైస్కూల్ విద్యార్థిని గార్లపాటి రిషిత అర్హత సాధించింది. ఈ మేరకు నాలుగేళ్ల కేంద్ర ప్రభుత్వం ప్రతీ ఏటా రూ.12,000 స్కాలర్‌షిప్‌ను అందజేస్తుంది. రిషితను హెచ్‌ఎం ఎస్కే మీరా సాహెబ్, ఉపాధ్యాయులు అభినందించారు.

అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం

ఇల్లెందు: విధుల్లో ఉన్న తన పట్ల విజిలెన్స్, సెక్యూరిటీ అధికారులు దురుసుగా ప్రవర్తించారని, ఫోన్ లాక్కుని అందులోని వ్యక్తి డేటాను డౌన్‌లోడ్ చేసుకుని తన హక్కులకు భంగం కలిగించారని దళిత నేత, సింగరేణి సెక్యూరిటీ గార్డు, ఐఎన్‌టీయూసీ నేత లింగాల జగన్నాథం ఆరోపించారు. ఈ మేరకు శనివా రం ఇల్లెందులోని జేకే బస్టాఫ్ వద్ద అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేసి తన గోడు వెళ్లబోసుకున్నారు. పోలీస్ ఉన్నతాధికారులకు, ఎస్సీ, ఎస్టీ కమిషన్, సింగరేణి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

కాంగ్రెస్ నాయకుడు మృతి



పాడే మోస్తున్న కొత్వాల శ్రీనివాసరావు

పాల్వంచ: సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, మున్సిపల్ కాంట్రాక్టర్ గట్టాయిగూడెంకు చెందిన పైడిపల్లి మనోహర్‌రావు శుక్రవారం సాయంత్రం అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన మృతదేహాన్ని శనివారం పలువురు రాజకీయ నాయకులు నివాస గృహం వద్ద సందర్శించి నివాళులర్పించారు. రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ డైరెక్టర్ కొత్వాల శ్రీనివాసరావు, తదితరులు పాడే మోసారు.



ఔషధ గుణాల.. అల్ల నేరేడు

- మార్కెట్లో విరివిగా పండ్ల అమ్మకాలు
- కేజీ ధర రూ.200
- ఆరోగ్యానికి మంచిదంటున్న వైద్యులు



కొత్తగూడెంలో తోపుడు బండిపై అమ్ముతున్న అల్ల నేరేడు పండ్లు


చుంచుపల్లి: ఏ సీజన్‌లో వచ్చే పండ్లను ఆ సీజన్లో తినడం ఆరోగ్యానికి చాలా మంచిదని పెద్దలు, వైద్యులు చెబుతుంటారు. ప్రస్తుతం అల్లనేరేడు పండ్ల సీజన్ కొనసాగుతోంది. ఈ పండులోని యాంటీ ఆక్సిడెంట్లు కేన్సర్, కాలేయ సంబంధ వ్యాధుల్ని నివారించే ఎన్నో ఔషధగుణాలున్నాయి. వగరు, తీపి, పులుపు రుచుల మేళవింపు ఈ అల్లనేరేడు పండు సొంతం. ఈ పండ్లను కనీసం రోజుకి పదైనా తింటే మంచిది. ఇది ఆకలిని పెంచుతుంది. వీటిలో ఉండే యాసిడ్ గుణం వల్ల కడుపులోకి వెళ్లే వెంట్రుకలు, లోహపు ముక్కలు కరిగిపోతాయి. అందుకే దీనిని 'మిరాకిల్ ఫ్రూట్' అంటారు. అల్లనేరేడు పండ్లు రోగ నిరోధక శక్తిని పెంచుతాయి. ముఖ్యంగా షుగర్ వ్యాధిగ్రస్తులకు చాలా మంచిదని చెబుతారు. అల్ల నేరేడు పండ్లలో గ్లైసెమిక్ ఇండెక్స్ తక్కువగా ఉంటుంది. అధిక మూత్ర విసర్జన, దప్పిక వంటి డయాబెటిస్ లక్షణాలను అల్ల నేరేడు పండ్లు తగ్గిస్తాయి. జీర్ణక్రియను మెరుగుపర్చడంతో పాటు విరేచనాల్ని సాఫీ చేస్తుంది. అల్లనేరేడు పండు రక్తంలోని షుగర్ నిల్వలను నియంత్రిస్తుంది. ఔషధ గుణాలు ఉండటంతో మెడిసిన్ తయారీలో దీనిని ఉపయోగిస్తున్నారు.

జూన్, జూలైలో అమ్మకాలు...

ఔషధ గుణాలున్న అల్లనేరేడు పండ్లు మార్కెట్లోకి వచ్చేశాయి. ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు ఉన్న ఈ పండ్లు కాస్తంతా వగరు, తీయగా ఉంటూ నల్లగా మెరుస్తుంటాయి. చిరు వ్యాపారులు తోపుడు బండ్లలో అల్లనేరేడు పండ్లను విక్రయిస్తున్నారు. సీజన్‌లో వచ్చే ఈ పండ్లను కొన్ని రోజులైనా తినాలని వైద్యులు చెబుతున్నారు. రోగనిరోధక శక్తిని పెంపొందించే ఈ పండ్లు ముఖ్యంగా షుగర్ వ్యాధిగ్రస్తులకు బాగా పనిచేస్తాయని వైద్యులు చెబుతున్నారు. ఏటా జూన్ ప్రారంభం నుంచి అన్ని ప్రాంతాల్లో ఈ పండ్లు ఉంటాయి. ప్రస్తుతం కొత్తగూడెం, పాల్వంచ పట్టణాల్లో రోడ్ల పక్కన, మార్కెట్‌లో చిరు వ్యాపారులు అమ్ముతున్నారు. స్థానికంగా కొన్ని అడవుల్లో లభ్యమవుతుండగా, చిరు వ్యాపారులు మాత్రం చిత్తూరు జిల్లా మదనపల్లి నుంచి దిగుమతి చేసుకుంటున్నారు. కేజీ పండ్లు ధర రూ.180 నుంచి రూ.200 వరకు విక్రయిస్తున్నారు. ముఖ్యంగా నేరేడుకు ఎలాంటి క్రిమి సంహారక, రసాయన ఎరువులు కూడా వినియోగించరు. సహజంగా పండే ఇలాంటి పండ్లను తినడం వల్ల ఎన్నో పోషకాలుతో పాటు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి.

ఆరోగ్య ప్రయోజనాలు...

- అల్ల నేరేడు పండ్లలో ప్రొటీన్, కాల్షియం, కార్బోహైడ్రేట్లు, ఐరన్, మెగ్నీషియం, పాస్ఫరస్, పొటాషియం, సోడియం, విటమిన్ సి, థయామిన్, విటమిన్ బీ 6 ఎక్కువగా లభిస్తాయి.
- షుగర్‌ను అదుపు చేయడంతో పాటు గుండెకు మేలు చేస్తాయి. అధిక రక్త పోటు నివారణకు అల్ల నేరేడు పండ్లు దోహదం చేస్తాయి.
- శ్వాసనాళాలు, ఊపిరితిత్తులను శుభ్రం చేస్తుంది. చర్మం మెరిసేందుకు ఈ పండ్లు ఉపకరిస్తాయి.
- పండ్లలో అనేక ఔషధ గుణాలుంటాయి. చక్కెర వ్యాధి నియంత్రణకు ఇది రామబాణం.
- నేరేడు పండ్లు శరీరానికి చలువ చేస్తాయి. నీరసంగా ఉన్నప్పుడు నేరెడు పండ్లను తింటే తక్షణం శక్తి వస్తుంది.
- డయాబెటిక్ రోగులు రోజూ నేరేడు పండ్లు తీసుకోవడం వల్ల మంచి ఫలితం ఉంటుంది. ఇది చక్కెర స్థాయిలను కంట్రోల్ చేస్తుంది.
- ఈ పండులోని యాంటీ ఆక్సిడెంట్లు మెదడుకు, గుండెకు ఔషధంగా పనిచేస్తాయి.
- మహిళలకు రుతుస్రావం అధికంగా అయితే నేరేడు గింజల పొడిని కషాయంగా చేసుకొని చెంచాడు తాగితే మంచిది. నేరేడు పండు ఊబకాయాన్ని తగ్గిస్తుంది.
- నేరేడు పండ్లలోని యాంటీ ఆక్సిడెంట్లు కాలేయ పనితీరును మెరుగుపర్చడంలోనూ కీలక పాత్ర పోషిస్తాయి.
- నేరేడు పండ్లలో అధిక మొత్తంలో పొటాషియం ఉంటుంది. రక్తపోటును తగ్గించడంలో సహాయపడుతుంది. నేరేడు పండు చిగుళ్ల వ్యాధులను నివారిస్తుంది.





మదనపల్లి నుంచి దిగుమతి..



ఇప్పుడు అల్ల నేరేడు పండ్ల సీజన్. జూన్ నుంచి ఇవి మార్కెట్లోకి వచ్చాయి. కొత్తగూడెం పరిసర ప్రాంతవాసులు ఈ పండ్లను ఇష్టంతో కొనుగోలు చేస్తుంటారు. ప్రస్తుతం చిత్తూరు జిల్లా మదనపల్లి నుంచి అల్ల నేరేడు పండ్లను తీసుకొచ్చి అమ్ముతున్నాం. అమ్మకాలు బావున్నాయి.

– కట్టా ఏసు, చిరు వ్యాపారి, కొత్తగూడెం

ఆరోగ్యానికి ఎంతో మేలు..



ఎర్ర రక్తకణాలు వృద్ధి చెంది ఆరోగ్యంగా ఉండేందుకు నేరేడు పండ్లు ఎంతో ఉపయోగపడతాయి. మధుమేహం ఉన్న వాళ్లకు ఇవి చాలా మంచివి. గర్భిణులు తింటే తల్లీబిడ్డలకు దివ్య ఔషధంలా పనిచేస్తుంది. ఇవి కంటి సమస్యలు, నొప్పులను నివారించడంలో సహాయపడుతుంది.

– నేహా అంజ్రీన్, వైద్యాధికారి, పెనగడప

సామాజిక బాధ్యతగా తీసుకోవాలి



పాల్వంచరూరల్: సోములగూడెంలో మొక్క నాటుతున్న సొసైటీ డైరెక్టర్లు



చుంచుపల్లి: మొక్కలు నాటుతున్న సొసైటీ సిబ్బంది

పాల్వంచరూరల్: పర్యావరణ పరిరక్షణను ప్రతీఒక్కరు సామాజిక బాధ్యతగా భావించి మొక్కలు నాటాలని మార్క్‌ఫెడ్ మాజీ డైరెక్టర్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. అంతర్జాతీయ సహకార దినోత్సవం సందర్భంగా శనివారం మండలంలోని సోములగూడెం గ్రామంలోని సొసైటీ ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద కొత్వాల మొక్కలు నాటారు. మాట్లాడుతూ.... మొక్కలు నాటి సంరక్షించడం వలన వర్షాలు సమృద్ధిగా కురుస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ వైస్ చైర్మన్ కాంపెల్లి కనకేష్, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

చుంచుపల్లి: అంతర్జాతీయ సహకార దినోత్సవాన్ని కొత్తగూడెం సొసైటీ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా జరుపుకున్నారు. అనంతరం చుంచుపల్లి హౌసింగ్ బోర్డులో హరితహారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహకార శాఖ అధికారి ఏ.శ్రీనివాసరావు, సొసైటీ చైర్మన్ మండే వీర హనుమంతరావు పాల్గొని మునగ, గానుగ మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో మానిటరింగ్ అధికారి శ్రీదేవి, సొసైటీ సెక్రటరీ పండ్ల సారయ్య, సిబ్బంది ఉష, మమత, రైతులు పాల్గొన్నారు.

టేకులపల్లి: అంతర్జాతీయ సహకార దినోత్సవ కార్యక్రమం శనివారం టేకులపల్లి మండల కేంద్రంలోని బేతంపూడి సొసైటీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. చైర్మన్ లక్కినేని సురేందర్‌రావు ఆధ్వర్యంలో సొసైటీ ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం ఇటీవల ఇల్లెందు నియోజకవర్గ ఆత్మ కమిటీ చైర్మన్‌గా ఎన్నికైన బోడ మంగీలాల్‌కు స్వీట్ తినిపించి శుభాకాంక్షలు తెలిపి శాలువాతో సన్మానించారు. సొసైటీ డైరెక్టర్లు, సిబ్బంది, రైతులు లక్కినేని శ్యాంబాబు, గుడిపూడి కృష్ణార్జున్‌రావు, వెంకటనారాయణ పాల్గొన్నారు.

జూలూరుపాడు: అంతర్జాతీయ సహకార దినోత్సవం సందర్భంగా స్థానిక సహకార సంఘం కార్యాలయ ఆవరణంలో శనివారం జిల్లా సహకార అధికారి (డీసీఓ) ఎ. శ్రీనివాసరావు, జూలూరుపాడు సొసైటీ చైర్మన్ చీమలపాటి భిక్షం మొక్కలు నాటారు. డీసీఓ శ్రీనివాసరావు, సొసైటీ చైర్మన్ భిక్షం, అసిస్టెంట్ రిజిస్ట్రార్లు శ్రీదేవి, స్వప్న, సీనియర్ ఇన్‌స్పెక్టర్ వరుణ్, జూలూరుపాడు సహకార బ్యాంకు బ్రాంచి మేనేజర్ మానుష, సూపర్‌వైజర్ నరేష్, డైరెక్టర్లు పాల్గొన్నారు.

'నానో'తో ఉపయోగం

టేకులపల్లి: రైతులకు నానో యూరియా వల్ల అనేక లాభాలున్నాయని ఇల్లెందు ఏడీఏ గుగులోత్ లాల్‌చంద్ అన్నారు. ఈ మేరకు వ్యవసాయ శాఖ, ఆత్మ కమిటీ ఆధ్వర్యంలో బేతంపూడి గ్రామంలో రైతులకు అవగాహన కల్పించారు. సింగబోయిన రమేష్ పత్తి పంటలో నానో యూరియా పిచికారీ ప్రదర్శన చేయించారు. నానో యూరియా పిచికారీ చేయడం వలన పూర్తి స్థాయి వినియోగం జరుగుతుందని పేర్కొన్నారు. ఆ తరువాత బచ్చలకూడి అశోక్‌కు చెందిన క్షేత్ర సందర్శన చేసి అక్కడ కొర్రమీను చేపల పెంపకంపై నీటి కుంట వలన లాభాల గురించి తెలియజేశారు. జారాద్రి శ్రీనివాస్ క్షేత్ర సందర్శనలో మునగ మొక్కల పెంపకం, నిమ్మ తోటల గురించి సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఇల్లెందు నియోజకవర్గ ఆత్మ కమిటీ చైర్మన్ బోడ మంగీలాల్ నాయక్, ఏఓ సీరుడు అన్నపూర్ణ, ఏఈఓ ప్రవీణ్‌ప్రకాశ్, నరసింహారావు, సతీష్, రైతులు పాల్గొన్నారు.

ప్రకృతి ఆశ్రమంలో శ్రీకాంత్‌కు సన్మానం



శ్రీకాంత్ దంపతులను సన్మానిస్తున్న దృశ్యం

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెంలో ప్రకృతి ఆశ్రమం ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి సింగరేణి విశ్రాంత ఏజీఎం, ప్రకృతి ఆశ్రమం గౌరవ ఉపాధ్యక్షుడు గోనె శ్రీకాంత్ – దయాకుమారి దంపతులను ఘనంగా సన్మానించారు. అతిథులుగా హాజరైన వక్తలు మాట్లాడుతూ.. శ్రీకాంత్ శేష జీవితం సామాజిక అభివృద్ధి కార్యక్రమాలకు, రాజ్యాంగ పరిరక్షణకు, పర్యావరణ ప్రకృతి సంరక్షణలకు వెచ్చించాలని కోరారు. శ్రీకాంత్ మాట్లాడుతూ.. సింగరేణి సంస్థలో సాధారణ ఉద్యోగిగా ప్రారంభించి ఏజీఎంగా కొత్తగూడెంలో రిటైర్మెంట్ పొందడం గర్వకారణంగా ఉందన్నారు. తన శేష జీవితాన్ని సామాజిక సమస్యల పరిష్కారానికి కేటాయించనున్నట్లు చెప్పారు. సుగుణారావు, బత్తుల కృష్ణయ్య, మొక్కల వెంకటయ్య, శనగ వెంకటేశ్వర్లు, జి.కనకరాజు, కొచ్చర్ల కమలారాణి, కే.హెచ్ ప్రసాద్, శివ, మొక్కల రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన బీజేపీ నాయకులు

జూలూరుపాడు: స్థానిక కేజీబీవీ ప్రాంగణంలో శనివారం విద్యార్థినులతో కలిసి బీజేపీ నాయకులు మామిడి, జామ, ఉసిరి మొక్కలను నాటారు. ఈ సందర్భంగా బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి చిలుకూరి రమేష్ మాట్లాడుతూ.. ప్రధాని మోదీ ఎన్నో సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కేజీబీవీ ఎస్‌ఓ పద్మజ, బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు మాదినేని సతీష్, బీజేపీ మండల అధ్యక్షుడు భూక్యా రమేష్, సిరిపురపు ప్రసాద్, పుల్లారావు, గోపాల్‌రావు, గుగులోత్ రాంబాబు, నర్వనేని కృష్ణ, టీచర్లు, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఆరోగ్యమే.. మహాభాగ్యం

- పొంచి ఉన్న సీజనల్ వ్యాధులు
- అప్రమత్తంగా ఉండాలంటున్న వైద్యులు

టేకులపల్లి: ప్రస్తుతం వర్షాకాలం నేపథ్యంలో అనేక వ్యాధుల ప్రమాదం కూడా పొంచి ఉంది. తేమతో కూడిన వాతావరణం, నిల్వ ఉన్న నీరు, సూర్యరశ్మి తక్కువగా ఉండటం వల్ల డెంగీ, మలేరియా, చికెన్ గున్యా, కలరా, టైఫాయిడ్, కామెర్లు, చర్మ వ్యాధులు, శ్వాసకోశ సమస్యలు మరియు వైరల్ జ్వరాలు వంటి సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఎక్కువ. వీటి నుంచి రక్షణ పొందేందుకు ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వైద్యాధికారుల సూచనలు, వైద్య ఆరోగ్య శాఖ ప్రణాళికలు కీలకం. ఇప్పటికే వైద్యాధికారులు, సిబ్బంది గ్రామాల్లో పర్యటించి గ్రామీణులకు ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తూ వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి అనుమానితుల నుంచి రక్త నమూనాలను సేకరిస్తున్నారు. అంతేకాకుండా మలేరియా వ్యాప్తిని అరికట్టేందుకు నియంత్రణ చర్యలను ముమ్మరం చేశారు. వర్షాలు కారణంగా నీటి నిల్వలు పెరగడం, దోమల వృద్ధి ద్వారా మలేరియా వ్యాప్తి చెందే ప్రమాదం ఉంది. ఈ నేపథ్యంలో ముందుగానే అప్రమత్తమై ప్రజల్లో అవగాహన కల్పించడం, నివారణ చర్యలు చేపట్టడం ద్వారా వ్యాధులను నిర్మూలించవచ్చని వైద్యాధికారులు చెబుతున్నారు.

ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు...

- భోజనానికి ముందు, మలమూత్ర విసర్జన తరువాత చేతులను శుభ్రంగా కడుక్కోవాలి.
- కలుషిత నీరు కలరా, టైఫాయిడ్, జీర్ణకోశ వ్యాధులకు కారణమవుతుంది. కాబట్టి తాగే నీటిని కాచి, ఫిల్టర్ చేసి లేదా శుద్ధి చేసిన నీటిని మాత్రమే తాగాలి.
- డెంగీ, మలేరియా, చికెన్ గున్యా వంటి వ్యాధులు రాకుండా పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలి.
- నిమ్మజాతిపండ్లు, వెల్లుల్లి, అల్లం, పసుపు, ఆకు కూరలు వంటి రోగనిరోధక శక్తిని పెంచే శుభ్రమైన ఆహార పదార్థాలను తీసుకోవాలి.
- వర్షంలో తడవడం వల్ల జలుబు, జ్వరం, శ్వాసకోశ సమస్యలు వచ్చే అవకాశం ఉంది. వెంటనే గోరువెచ్చని నీటితో స్నానం, శుభ్రమైన పొడి బట్టలు ధరించడం మంచిది.
- డెంగీ, మలేరియా వంటి వ్యాధుల లక్షణాలు కనిపిస్తే రక్త పరీక్షలు చేయించుకోవాలి.
- రోడ్ల వెంట అమ్ముడయ్యే ఆహార పదార్థాలు, పానియాలకు దూరంగా ఉండాలి. తాజా, వేడి ఆహారాన్ని తీసుకోవాలి. పండ్లు, కూరగాయలను శుభ్రంగా కడిగి ఉపయోగించాలి.

వైద్య ఆరోగ్య శాఖ ప్రణాళిక..

- గ్రామీణ ప్రాంతాలలో ఆరోగ్య శిబిరాలను ఏర్పాటు చేసి, ఉచిత వైద్య పరీక్షలు, రక్త నమూనాల సేకరణ, మరియు ఔషధాల పంపిణీ చేయడం జరుగుతోంది.
- దోమల వృద్ధిని నియంత్రించేందుకు ఫాగింగ్, నీటి నిల్వ ప్రాంతాలలో లార్వా నియంత్రణ రసాయనాల వాడకం, మరియు దోమతెరల పంపిణీ వంటి చర్యలు చేపడుతున్నారు.
- సీజనల్ వ్యాధుల లక్షణాలు, నివారణ చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ తిరిగి జ్వర బాధితుల సమాచారాన్ని అందిస్తున్నారు.
- ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో డెంగీ, మలేరియా పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయడం, అవసరమైన ఔషధాలను నిల్వ చేయడం జరుగుతోంది. ఆరోగ్య శాఖ అధికారులు పంచాయతీ, అధికారులతో కలిసి పారిశుద్ధ్య కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.



సిద్ధారం గొత్తికోయ గుంపులో దోమల నివారణ మందు పిచికారీ చేస్తున్న వైద్య సిబ్బంది



వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

వ్యాధుల కట్టడికి సమగ్ర ప్రణాళిక...



వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు డెంగీ, మలేరియా, టైఫాయిడ్ వంటి వ్యాధులు ప్రబలకుండా ఉండాలంటే పరిశుభ్రతే ముఖ్యం. కాచి చల్లార్చిన నీటిని తాగడం, తాజా ఆహారం తీసుకోవడం, మరియు ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవడం చాలా అవసరం. సీజనల్ వ్యాధులపై సమగ్ర ప్రణాళిక రూపొందించాం.

– కందుల దినేష్, వైద్యులు, పీహెచ్‌సీ సులానగర్

బిల్లుల మంజూరుకు కృషి చేస్తా..



స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కనకయ్య

ఇల్లెందురూరల్: ఇందిరమ్మ పథకంలో మోడల్ గ్రామంగా ఎంపికైన పూబెల్లిలో ఇళ్ల బిల్లుల మంజూరుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే కోరం కనకయ్య హామీ ఇచ్చారు. పూబెల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని శనివారం ఆయన పరిశీలించారు. ఇంటింటికీ వెళ్లి ప్రస్తుత నిర్మాణ దశ, బిల్లుల మంజూరు విషయాలను అడిగి తెలుసుకున్నారు. పూబెల్లిలో సెల్ సిగ్నల్ సమస్యగా ఉండటంతో బిల్లులు ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ చేస్తున్నామని, కొన్ని రోజులుగా ఆన్‌లైన్‌లో కూడా నమోదు కావడం లేదని పంచాయతీ కార్యదర్శి బాలకృష్ణ ఎమ్మెల్యేకు వివరించారు. తాను గృహ నిర్మాణ శాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి బిల్లులు త్వరితగతిన మంజూరయ్యేలా సహకరిస్తానని చెప్పారు. ప్రస్తుతం వర్షాలు సమృద్ధిగా కురుస్తున్నందున నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తయ్యేలా వేగవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీఓ చిరంజీవి, హౌసింగ్ ఏఈ స్వాతి, పంచాయతీ కార్యదర్శి బాలకృష్ణ, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

పీరీల వేడుకకు హాజరైన ఎమ్మెల్యే

టేకులపల్లి: మూడ్ తండాలో శనివారం రాత్రి జరిగిన పీరీల వేడుకల్లో ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య పాల్గొన్నారు. భక్తులతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం అన్నదానం ప్రారంభించారు. ఎస్‌ఐ అలకుంట రాజేందర్, కోరం సురేందర్, బోడ మంగీలాల్, మూడు బిచ్చు, రమణ, రాజ్‌కుమార్, కృష్ణ, మూడ్ సంజయ్, పవన్, గణేష్, భూక్యా సర్దార్, సుభాష్ చంద్రబోస్, శేఖర్, సుధీప్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి

పాల్వంచరూరల్: విద్యార్థుల పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో విద్యార్థులు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎదుట శనివారం నిరసన వ్యక్తం చేశారు. సాయి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 18 నెలలు గడుస్తున్నా విద్యా రంగంపై నిర్లక్ష్యం చేస్తోందన్నారు. కార్యక్రమంలో అఖిల్, రమేష్, నరేష్, నాగశ్రీ, జ్యోతి, మానస పాల్గొన్నారు.

జూలూరుపాడు: పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్ షిప్‌ను ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యుడు పి.పవన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న రూ.8,000 కోట్లను విడుదల చేయాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో శనివారం తహసీల్దార్ శ్రీనివాస్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పృథ్వీ, రామ్‌చరణ్, నవీన్, శంకర్, వంశీ, శివ పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న నాయకులు

జూలూరుపాడు: పడమటనర్సాపురం గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లకు శనివారం కాంగ్రెస్ నాయకులు లేళ్ల వెంకటరెడ్డి, మండల అధ్యక్షుడు మాలోత్ మంగీలాల్, గ్రామ అధ్యక్షుడు లేళ్ల గోపాల్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సొంతింటి కలను సాకారం చేయాలనే లక్ష్యంతో ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రవేశపెట్టి అమలు చేస్తోందన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ గాడ్విన్, పంచాయతీ సెక్రటరీ హారిక, దుద్దుకూరి మధుసూదన్‌రావు, గోసు రామారావు, బాదావత్ హరీష్, మాలోత్ నగేష్, బూరం రమేష్, దామెర్ల శ్రీకాంత్, రామక్రిష్ణ, ఎం.శ్రీనివాసరావు, జి.రమేష్, ఎం.రాంబాబు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

'దేశ విచ్ఛిన్నమే మోదీ అజెండా..'



మాట్లాడుతున్న ఖాద్రీ

జూలూరుపాడు: భారతదేశంలో ప్రజల మధ్య విభేదాలు సృష్టించి, విచ్ఛిన్నం చేయడమే ప్రధాని నరేంద్ర మోదీ అజెండా అని ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వలి ఉల్లా ఖాద్రీ, కార్యదర్శి కల్లూరి ధర్మేంద్ర అన్నారు. శనివారం జూలూరుపాడు ఆర్‌కే ఫంక్షన్ హాల్‌లో జరిగిన ఏఐవైఎఫ్ జిల్లా 2వ మహాసభకు వారు ముఖ్యఅతిథులుగా హాజరై మాట్లాడారు. దేశంలో నివసించాలంటే ఆర్‌ఎస్‌ఎస్ అనుమతి అవసరం అనేలా నీచ రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు. బీజేపీ అధికారంలోకి వస్తే ప్రతీ ఏడాది 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామన్న హామీ నీటి మూటలేనన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ భావజాలాన్ని బలవంతంగా దేశంలో మతోన్మాదం, కాషాయ విషబీజాలను విద్యార్థులు, యువత మెదడల్లో చొప్పించడానికి తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. మోదీ తనలా యువతను తయారు కావాలని అంటున్నారని, మోదీలా మారాలంటే దేశ సమైక్యతను దెబ్బతీసే విధానాలను అనుసరించి మతోన్మాద రాజకీయాలను ప్రోత్సహించడమేనన్నారు. ఏఐవైఎఫ్ యువతను మంచి సమాజం వైపు నడిపించేందుకు కృషి చేస్తుందన్నారు. భారత రాజ్యాంగం కల్పించిన హక్కులను ప్రజాస్వామ్యయుతంగా దక్కించుకోవాలని చెప్పారు. అంతకముందు ఏఐవైఎఫ్ జెండాను నాయకులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎస్.రామకృష్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్కే నాగుల్‌మీరా, ఎస్కే చాంద్‌పాషా, ఎనుముల సాయి, ఖయ్యూం, ఎస్కే ఫహీం, యు.హరీష్, సతీష్, సురేంద్రపాల్, జాకీర్ పాల్గొన్నారు.

బిల్లుడుతండాలో వైద్య శిబిరం

టేకులపల్లి: బొమ్మనపల్లి ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ పరిధిలోని బిల్లుడు తండా గ్రామంలో సులానగర్ పీహెచ్‌సీ వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో శనివారం వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలోని పిల్లలకు, తల్లులకు సికిల్ సెల్ ఎనీమియా స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. తేజావత్ లావణ్య, ప్రసాద్ కూతురుకి అన్నప్రాసన చేశారు. ఈ కార్యక్రమంలో మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్ హారిక, ఏఎన్‌ఎంలు కమల, సుజాత, అంగన్‌వాడీ టీచర్ సరోజ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.